# నాలుగు దారుల కూడలి


**– సీతా సత్య**

"మన పెళ్ళికి మీ వాళ్ళు ఒప్పుకుంటారనే అనుకుంటున్నావా?" అన్నాడు రోహిత్, హారిక ఒళ్ళోంచి లేచి కూర్చుంటూ.

హారిక ఆశ్చర్యంగా చూసి అంది, "మరి...పెద్దవాళ్ళొప్పుకోకుండా మన పెళ్ళెలా అవుతుందీ?!"

"నువ్వు ఆగర్భశ్రీమంతురాలివి. నేను పుట్టుకతో దరిద్రుణ్ణి. మన కులాలు వేరు. ప్రాంతాలు వేరు. అందుకే అంటున్నాను.. మన పెళ్ళికి మీవాళ్ళు ఒప్పుకునే అవకాశాలు దాదాపుగా.. దాదాపు ఏవిటి.. అస్సలు లేవు." అన్నాడు రోహిత్ దీనంగా మొహంపెట్టి.

"ఇంతవరకూ నేను ఏ కోరిక కోరినా మా నాన్నగారెపుడూ కాదనలేదు. మా నాన్నగారి మాటను అమ్మ ఎప్పుడూ కాదనదు." అంది హారిక నమ్మకంగా.



రోహిత్ నవ్వుతూ అన్నాడు. "నీకు చిన్నపుడు నువ్వు కోరిన బొమ్మలూ, బట్టలూ, ఇతర వస్తువులూ ఇవ్వడం లాంటిది కాదిది. కూతురి పెళ్ళి విషయానికొచ్చేసరికి నాన్నలందరూ సినిమాల్లో విలన్ల టైపే!"

"ఎవరి సంగతో మనకెందుకు రోహిత్! మన పెళ్ళికి మా నాన్నగారు తప్పకుండా ఒప్పుకుంటారు. సరేనా!"అంది హారిక, రోహిత్ చేయి పట్టుకుని ఆప్యాయంగా నొక్కుతూ.

"ఒకవేళ మీ నాన్నగారు మన పెళ్ళికి ఒప్పుకోలేదనుకో! అప్పుడు మన పరిస్థితేఁవిటి?! ఇవన్నీ లేకుండా ఉండాలంటే గుట్టుచప్పుడు కాకుండా మనం పెళ్ళిచేసుకుని ఆ తర్వాత పెద్దవాళ్ళముందుకు వెళ్ళడమే" అన్నాడు రోహిత్.

హారిక కళ్ళు పెద్దవిచేసి భయం భయంగా చూస్తూ అంది. "అమ్మో... లేచిపోయి పెళ్ళిచేసుకోవడమా! ఊహుఁ అలా చేయడం నాకెంతమాత్రమూ ఇష్టంలేదు."

"మరైతే మనం కలిసి జీవించేదెలా?!" అన్నాడు రోహిత్ దయనీయంగా చూస్తూ. ఆ మాటల్తో హారిక కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"కాఫీ అంటే ఎంతో ఇష్టపడే నువ్వు నాకోసం బోర్నవిటా అలవాటు చేసుకున్నావు. మగవాళ్ళ ఎడమ పాపిట తీసుకుంటే నాకు నచ్చదని దాన్ని మార్చుకున్నావు. ఫుల్ హాండ్స్ చొక్కాలు నాకిష్టం ఉండదని హాఫ్ స్లీవ్ చొక్కాలు వేసుకోవడం అలవాటు చేసుకున్నావు. మనం బీచ్‌కెళ్ళిన ప్రతిసారీ నాకు పిడత కింద పప్పు కొని పెట్టావు.

ఐస్‌క్రీముల్లో అన్ని రకాలూ రుచి చూపించావు. నా పెన్సిల్స్ చెక్కి పెట్టావు. నా మొహానికి ఏ రంగు బొట్టు బావుంటుందో నువ్వే ఎంపికచేసి పెట్టావు. ఏ రంగు డ్రెస్ నాకు నప్పుతుందో మా అమ్మకంటే నీకే బాగా తెల్సు.

నీ సమక్షంలో యుగాలైనా క్షణాల్లా గడిచిపోతాయి నాకు. నిన్నుగాక మరొకర్ని చేసుకోవాల్సి వస్తుందనే ఊహే ఎంతో భయంకరంగా ఉంది నాకు. అటువంటి పరిస్థితే వస్తే.. వచ్చే జన్మలోనైనా మనం కలసి ఉండాలని కోరుకుని చచ్చిపోదాం. చనిపోయేముందు కోరుకున్న కోరికలు తర్వాతి జన్మలో తప్పకుండా తీరుతాయట." అంది హారిక గుక్కతిప్పుకుందుకు ఆగి.

"ఈ జన్మలో కలిసి బ్రతికే అవకాశాన్ని వదులుకుని వచ్చే జన్మమీద ఆశలు పెంచుకోవడమెందుకు? ఏమో వచ్చే జన్మలో నేను డబ్బున్న వాడిగానూ, నువ్వు బీద అమ్మాయిగానూ పుట్టామనుకో! మన అంతస్తులు తారుమారైనా పరిస్థితి మళ్ళీ ఇప్పుడున్నట్టే ఉండదని నమ్మకమేం వుంది? అప్పుడూ ఇలానే అనుకుని మళ్ళీ చచ్చిపోయామనుకో! ఆ తర్వాతి జన్మలో కూడా ఇదే పరిస్థితి పునరావృతం కావచ్చుకదా! నువ్వే ఆలోచించు" అన్నాడు రోహిత్ ఆమెను దగ్గరకు తీసుకుంటూ.

"ఏమో రోహిత్ ఏంచేయాలో నాకర్థంకావడంలేదు" అంది హారిక బిక్కమొహం పెట్టి.

* * *

"ఊరుకో వదినా... ఏం కాదు. చిన్న పిల్లకదా! తెలియక తొందరపడి ఉంటుంది.. వచ్చేస్తుందిలే. మనవాళ్ళంతా ఆ ప్రయత్నంలోనే కదా ఉన్నారు. దిగులుపడకు." అంటూ అన్నపూర్ణను ఓదార్చే ప్రయత్నం చేసింది ప్రభావతి.

ఏడ్చి ఏడ్చి ఉబ్బిపోయిన మొహాన్ని ఒళ్ళోనే దాచుకుని తలపైకెత్తకుండానే అంది అన్నపూర్ణ. "ఏం లోటు చేశాం చెప్పు దానికి! అడిగినదల్లా కొనిచ్చాం. ఏం కోరినా తీర్చాం. దానికి చిన్న దెబ్బ తగిలితే మాకే తగిలినట్టు విలవిల్లాడిపోయాం.

అది ఎంపిక చేసిన బట్టల్నే కొనిచ్చాం. కోరిన కాలేజీలోనే చేర్పించాం. దాన్నెన్నాడూ పల్లెత్తు మాటనలేదు. ఏనాడూ దానిమీద కోపగించుకోలేదు. ఒక్కగానొక్క పిల్లకదాని దాని మనసు కష్టపెట్టకుండా అల్లారుముద్దుగా పెంచుకున్నాం. ఇంత చేసిన మాతో మాటమాత్రమైనా చెప్పకుండా ఎవరో అణాకానీ వాడితో అది ఇల్లొదిలి వెళ్ళిపోయిందంటే ఎలా తట్టుకోవాలి మేం!

ఇహ ఆయనైతే చెప్పనక్కర్లేదు. పంచప్రాణాలూ దానిమీదే పెట్టుకుని బ్రతుకుతున్నారు. దాని పెళ్ళి గురించి ఎన్ని కలలు కన్నారాయన! విషయం తెల్సినప్పటినుంచీ గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకున్నారు.

ఉదయంనుంచీ పచ్చిమంచినీళ్ళు ముట్టుకోలేదాయన. తప్పు అదిచేస్తే శిక్ష తనకు విధించుకున్నారాయన! ప్రాణం లేని మనిషిలా కనురెప్పలు కదుల్తున్నాయో లేదో కూడా తెలియకుండా విగ్రహంలా, అలానే కూర్చుని ఉన్నారాయన.

అదిగో ఆ కిటికీలోంచి చూడు. మేమేం పాపం చేశామని మాకీ శిక్ష!? ఎవరికన్యాయం చేశామని మమ్మల్నింత క్షోభ పెడుతున్నాడా దేవుడు? "మధ్యమధ్యలో వెక్కుతూ, ముక్కెగబీలుస్తూ ఎగిరెగిరి పడుతోన్న గుండెలతో అతికష్టంమీద శ్వాస తీసుకుంటూ ఏ నిముషంలోనైనా స్పృహ తప్పి పడిపోయేలా కనిపించింది అన్నపూర్ణ ప్రభావతికి.

"నువ్వు బాధపడినంత మాత్రాన సమస్య తీరిపోతుందా? పిల్లల్నంటే కన్నాం గానీ వాళ్ళ తల రాతలు మన చేతుల్లో ఉంటాయా? ఏడవకు! తప్పకుండా హారిక దొరుకుతుంది. మన కాలనీ మగవాళ్ళంతా ఆ పనిమీదే ఉన్నారు.

నగరమంతా గాలింపైనాసరే హారిక ఆచూకీ కనిపెట్టి తప్పకుండా తీసుకొస్తారు. సరేనా!" అనునయంగా అంటూ ఆమె తలను పైకెత్తి తన ఒళ్ళో పెట్టుకుని అన్నపూర్ణను ఊరడించసాగింది ప్రభావతి.

* * *

"ఆ వెధవ ఎలా నచ్చాడో దీనికి?! 'ప్రేమ గుడ్డిదనే సామెత ఆ కుర్ర వెధవను చూశాక తెలిసింది. ఆ నానుడిలో ఎంత నిజముందో!"అన్నాడు రాఘవ చొక్కా విప్పి హేంగర్‌కు తగిలిస్తూ.

"ఏం.. కుర్రాడు అస్సలు బావుండడా?" అంది సంగీత భర్త చేతినుంచి హేంగర్‌ను అందుకుంటూ.

"బావుండడమా? అంత అనాకారి వెధవని నా జన్మలో చూడలేదు నేను. దీనికేం మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడో తెలియదు గానీ ఒహ పట్నాన మాతో రాలేదు హారిక. ముగ్గురం కలిసి బలవంతంగా ఈడ్చుకొచ్చి కార్లోపడేయాల్సి వచ్చింది"అన్నాడు రాఘవ నిట్టూరుస్తూ.

"పోనీలెండి.. ఎలా అయితేనేం వాడి చెరనుంచి ఆ పిల్లను విడిపించుకొచ్చారు. నిన్నటినుంచీ అన్నపూర్ణనూ, విశ్వనాథంగారినీ చూస్తోంటే గుండె తరుక్కుపోతోంది మా అందరికీ!" అంది సంగీత.

"పూటకు ఠికానాలేని వెధవ. వాడిలాంటి మరో ఇద్దరు బేవార్సు వెధవల సాయంతో హారికను ఊరుదాటించే ప్రయత్నం చేశాడు. మనం త్వరపడకపోతే హారిక మనకెప్పటికీ దొరికుండేది కాదు." అన్నాడు రాఘవ గత ముప్పైఆరు గంటల్లోనూ తాము పడిన ఆరాటాన్నీ, శ్రమనూ గుర్తుచేసుకుంటూ.

"ఇంత త్వరగా హారికను పట్టుకుని తీసుకురావడం నిజంగా చాలా అదృష్టమే! ఇంతకూ ఎలా దొరికిందండీ హారిక!"అంది సంగీత ఆత్రుతగా.

"అబ్బో.. అది చాలా పెద్ద కథ. క్లుప్తంగా చెప్పాలంటే.. పోలీసు రిపోర్టిచ్చాక నేనూ, జగన్నాథం, భాస్కర్ ఆ కుర్రాడి దగ్గర స్నేహితుల గురించి ఆరాతీశాం. వాడికి ముగ్గురు స్నేహితులున్నారు. అందులో ఇద్దరు ఊళ్ళో లేరు. మూడోవాణ్ణి పట్టుకుని మర్యాదగా అడిగితే ఒహపట్నాన వాడు నిజం చెప్పలేదు. అన్ని రకాల ట్రిక్కులూ ప్రయోగించాక నోరు విప్పాడు వాడు.

రోహిత్, హారికా.. రోహిత్ అంటే హారికను ప్రేమించానని చెప్పి తీసుకుపోయిన వెధవ.. ఇందాక ఇద్దరు బేవార్సుగాళ్ళని చెప్పాను కదా.. ఆ బేవార్సు స్నేహితులూ కొంచెం దూరం సిటీ బస్సుల్లోనూ, మరి కొంచెం దూరం ఆటోల్లోనూ, టాక్సీల్లోనూ, కాలినడకనా.. ఇలా అంచెలంచెలుగా ప్రయాణంచేసి ఒకచోటికి చేరుకున్నారు. మాకు దొరికిపోయిన మూడో బేవార్సు వెధవ తన దగ్గరున్న సెల్‌ఫోన్‌లో ఇక్కడి పరిస్థితిని ఎప్పటికప్పుడు మిత్రబృందానికి చేరవేస్తూ వాళ్ళకు దిశానిర్దేశం చేస్తూ వచ్చాడు.

అదృష్టవశాత్తూ కీలకమైనవాడు మాకు దొరకడంతో

కొంచెం శ్రమపడినా గమ్యం చేరుకుని వాళ్ళిద్దర్నీ, వాళ్ళకు కాపలాగా ఉన్న వాళ్ళనూ పట్టుకోగలిగాం.

ఒక చిన్న పెంకుటింట్లో మేంవెళ్ళే సమయానికి రోహిత్‌తో కలసి కూర్చుని కాపలా కుర్రాళ్ళు తెచ్చిన భోజనం పొట్లాల్ని విప్పుతూ కనిపించింది హారిక. కనిపించిన వెంటనే హారికను గట్టిగా కోప్పడాలని అనుకున్న మేము మమ్మల్ని చూడగానే హారిక మొహంలో కనిపించిన భయం, ఆందోళనా, దిగులూ చూసి నోటమాట రాకుండా అలానే నిలబడిపోయాం. చిత్రంగా హారికనాపరిస్థితిలో చూసి మాకు కోపం రాలేదు సరికదా.. అంతులేని దుఃఖం వచ్చింది.

మన కళ్ళముందు పెరిగిన పిల్ల... చిన్నప్పుడు చాక్లెట్ ఇస్తే మెరిసే కళ్ళతో అందుకుని, 'థాంక్సంకుల్'అని చెంగు చెంగున లేడి పిల్లలా పరుగెత్తుకుంటూ వెళ్ళిన పసి పిల్ల.. పుట్టిన రోజుకు పెన్‌ను బహుమతిగా ఇస్తే, చెంప మీద ముద్దిచ్చి తన సంతోషాన్ని తెలియచేసిన చిన్న పిల్ల.. చిన్నప్పుడు అమ్మతో కథలు చెప్పించుకుని, ముద్ద ముద్దకూ బ్రతిమాలించుకుని గానీ తినని చిన్నారి హారిక.. అలా అనామకుల మధ్య, తన భవిష్యత్తు ఏం కానుందో తెలియని అమాయకత్వంతో హోటల్‌నుంచి తెచ్చిన భోజనపు పొట్లాల్ని విప్పుకుంటూ ఉండడం చూసి మాకందరికీ ఏడుపొచ్చింది.

అదంతా ఒక ఎత్తైతే హారికను ఇంటికి తీసుకొచ్చాక మేమెదుర్కున్న సమస్య మరొక ఎత్తు. గది లోపల తలుపులు వేసుకుని ఉన్న ఆయనకు కిటికీలోంచి విషయం వివరించాక ఆయన మావైపు తల తిప్పి చూసి, 'దాని మొహం నా కళ్ళబడ్డానికి వీల్లేదు. ఆ దరిద్రాన్ని వెంటనే ఇంట్లోంచి బయటకు తీసుకుపొండి'అని అరిచారు.

దారి పొడవునా హారికను సముదాయించి వాళ్ళింటికి తీసుకొచ్చిన మాకు ఎదురుచూడని విశ్వనాథంగారి ప్రవర్తనకు... నిజం చెప్పొద్దూ కాళ్ళూ, చేతులూ ఆడలేదు. ఆయన్తో అప్పుడేం మాట్లాడినా ప్రయోజనముండదని అర్థమైంది. చివరకు ప్రభావతిగారు హారిక వాళ్ళ అమ్మగార్ని ఒప్పించి విశ్వనాథంగారికి కోపం తగ్గి మామూలు మనిషయ్యేవరకూ తమ ఇంట్లో ఉంచుకుంటామని తమతో తీసుకెళ్ళారు" అన్నాడు రాఘవ వాష్ బేసిన్ దగ్గర చేతులు కడుక్కుంటూ.

"కాలనీ అందరికీ తలలో నాలుకలా ఉండే విశ్వనాథంగారికొచ్చిన కష్టం మామూలుది కాదు మరి! ఆయన కోలుకుని మామూలు మనిషయ్యేవరకూ మనందరమూ ఆ భార్యాభర్తలిద్దరికీ ఆసరాగా ఉండడమే మనం చేయగలిగింది ప్రస్తుతం" అంది సంగీత బాధగా.

* * *

ఆరోజు సాయంత్రం కాలనీవాసులందరూ సమావేశమయ్యారు.

ముందుగా భాస్కర్ అన్నాడు. "ఈ సమస్య ప్రస్తుత సమాజంలోని మనలాంటి తల్లిదండ్రులందరిదీ! మనలో ఎంతమందిమి మన పిల్లల్తో కలిసి భోజనం చేస్తున్నాం? చిన్నపుడు వాళ్లపట్ల చూపించిన శ్రద్ధను మనమిప్పుడు నిజంగా చూపిస్తున్నామా? నడక నేర్చుకునే వయసులో చిన్నపుడు తప్పటడుగులు వేసినప్పుడు మనం పిల్లలెక్కడ పడిపోతారోనని ఆందోళన చెందుతూ వారి వెనుకో, ముందో, పక్కనో ఉంటూ వాళ్ళు పడిపోతే పట్టుకుందుకు సిద్ధంగా ఉన్నప్పటి శ్రద్ధలో ఎన్నోవంతు మనం ఇప్పుడు పిల్లల పట్ల చూపిస్తున్నాం?

కౌమార దశలో పిల్లల ఆలోచనల్లో, ప్రవర్తనలో ఎటువంటి తర్కమూ ఉండదు. ఆ దశనుదాటి చాలాకాలమైన మనకు, మనమూ ఆ వయసులో వాళ్లలానే ప్రవర్తించామనే విషయం గుర్తుకురాదు. కీలకమంతా ఇక్కడే ఉంది.

ఆ వయసులో పిల్లలు తల్లిదండ్రులకు చెప్పుకోని విషయాలు స్నేహితులకెందుకు చెప్పుకుంటారు? స్నేహితులు వాళ్ళేం చెప్పినా వింటారు. దేనికీ ఆంక్షలు పెట్టరు. స్నేహితులు ఏ సలహా ఇచ్చినా దాన్ని నచ్చచెపుతున్నట్టుగా, అనునయంగా చెప్తారు. మనం?... వాళ్ళు మన పిల్లలేకదా అనే భావంతో, వాళ్ళు మనకంటే చిన్నవాళ్ళనే ఆలోచనతో మనమేం చెప్పినా వాళ్ళు విని తీరాలనే పట్టుదలతో మన భావాల్ని, ఇష్టాఇష్టాల్ని, కోపతాపాల్ని వాళ్ళ మీద రుద్దుతాం.

అందుకే అవి వాళ్ళకు సలహాల్లాకాక ఆంక్షల్లా అనిపించడంలో ఏమీ ఆశ్చర్యంలేదు. ఏ దారిలో వెళ్ళాలో తెలియని అయోమయ స్థితిలో వాళ్ళు నాలుగుదారుల కూడలిలో నిలబడి ఉన్నప్పుడు పక్కనే ఉండి సరైన దారిలో నడిపించవలసిన మనం ఆ పనిచేయకుండా వాళ్ళ కర్మానికి వాళ్లను వదిలేస్తున్నాం. అదృష్టవంతులు మంచి స్నేహితులు లభిస్తే సరైన దారిలో ప్రయాణించి సరైన గమ్యంవైపు నడుస్తున్నారు. దురదృష్టం వారిని చెడు స్నేహితుల రూపంలో నడిపిస్తే తెగిపోయిన గాలిపటాల్లా ఎటో కొట్టుకుపోతున్నారు."

"మనం చెప్పేది మాత్రమే పిల్లలు విని తీరాలని భావించే ఆలోచనలనుంచి బయటపడి, వాళ్ళు చెప్పేది కూడా మనం తప్పకుండా వినాలని ముందుగా మన మనసులకు మనం నచ్చచెప్పుకోవడం అలవాటు చేసుకోవాలి."

సంగీత అభినందన పూర్వకంగా చూస్తూ అంది. "మనం ఏం చేయాలో భాస్కర్‌గారు చాలా బాగా చెప్పారు. మనలో ఎంతమందిమి మన పిల్లలకు నీతి కథలు చెప్పాం? చిన్న వయసులో మనం చెప్పిన కథల్లోని నీతి అప్పుడు వాళ్ళకర్థంకాకపోయినా అర్థం చేసుకునే వయసొచ్చాక వారి మెదడు పొరల్లో నిక్షిప్తమై ఉన్న నీతి వెలికి వచ్చి విచక్షణతో వ్యవహరించమని హెచ్చరించి వారిని తప్పుదారిలోకి వెళ్ళకుండా ఆపుచేస్తుంది.

మన పనుల్నీ, వ్యాపకాల్నీ, సంపాదన వెంట పరుగుల్నీ తప్పనిసరిగా కొంతమేరకు త్యాగం చేసైనాసరే మన పిల్లలకోసం తగినంత సమయం కేటాయించాలి. చిన్నప్పుడు పిల్లలకు అ, ఆలు, ఎబిసిడిలు, కూడికలు రానప్పుడు మనమెంత ఆందోళన చెంది వారిపట్ల శ్రద్ధ చూపించి వారికవి నేర్పించామో అదే విధంగా వారు కొంచెం ఎదిగాక వారి టీచర్లనూ, లెక్చరర్లనూ తరచూ కలుస్తూ మన పిల్లల గురించి తెల్సుకుంటూ ఉండాలి.

"మనం మన పిల్లలమీద నిఘా ఉంచిన భావన వారిలో కలగకుండా వారి క్షేమం, అభ్యున్నతికోసం మనం ఎంత ఆరాటపడుతున్నామో వారికి తెలిసే విధంగా ప్రవర్తించాలి."

సంగీత వైపు మెచ్చుకోలుగా చూస్తూ జగన్నాథం భార్య రాజేశ్వరి అంది. "మన పిల్లలకు చిన్నప్పటినుంచీ డైరీలురాసే అలవాటుచేయాలి. ఇతరుల డైరీలు చదవడం తప్పనే ఆలోచనను పక్కనపెట్టి పిల్లల డైరీలను ముఖ్యంగా వాళ్ళు యుక్త వయసులో ఉన్నపుడు అప్పుడప్పుడూ చదువుతూ వాళ్ళు దారి తప్పుతున్నారనిపిస్తే నేరుగా వారితో విషయం చర్చించకుండా పరోక్షంగా ఒక స్నేహితుడు లేదా స్నేహితురాలిగా వారి వైపునుంచి ఆలోచించి సమస్య పరిష్కరించే దిశగా కృషిచేయాలి.

మనం చెప్పేది మాత్రమే పిల్లలు విని తీరాలని భావించే ఆలోచనలనుంచి బయటపడి, వాళ్ళు చెప్పేది కూడా మనం తప్పకుండా వినాలని ముందుగా మన మనసులకు మనం నచ్చచెప్పుకోవడం అలవాటు చేసుకోవాలి."

అంగీకార సూచకంగా తలాడిస్తూ ప్రభావతి అంది.

"విశ్వనాథంగారూ, అన్నపూర్ణగారూ హారికను ప్రేమగా చూసుకోలేదని ఎవరైనా చెప్పినా మనం నమ్ముతామా? కాలు క్రిందపెడితే కంది పోతుందేమోనన్నంతలా పెంచిన హారిక - తనతో ఎందులోనూ సరిపోలని రోహిత్ మాటనే ఎందుకు వేదంలా భావించి కన్నవాళ్లనొదిలేసి అతడితో వెళ్ళిపోయిందీ?

మనం మన పిల్లల భౌతిక అవసరాలు తీర్చేందుకు ప్రయత్నిస్తామే తప్ప వారి మనసుల్లోకి తొంగిచూసి వారి నర్థం చేసుకునే ప్రయత్నం చేయం. 'వాళ్ళింకా చిన్నపిల్లలు.. మనకు తెలియని అవసరాలు వారికేం ఉంటాయనే భ్రమలో ఉంటాం.'

మన పిల్లలు మననుంచి ప్రశంసనాశించినపుడు మనం విమర్శిస్తాం. తమనుతాము పురుషుడిగానో, స్త్రీగానో వ్యక్తీకరించుకునే వయసులో ఉన్నవాళ్ళు విమర్శను సహించలేరు.

మనమెప్పుడైతే వారి అంచనాలకు భిన్నంగా ప్రతిస్పందిస్తామో అప్పుడు వాళ్ళు తర్కంతో నిమిత్తం లేకుండా తమను ఎవరు మెచ్చుకుంటారో, ఎవరు సమర్థిస్తారో వారికంత దగ్గరా మనకంత దూరమూ అవుతారు.

యుక్తవయసులో ఉన్న పిల్లలు ఉరకలు, పరుగులతో శరవేగంతో గలగలా ప్రవహించే జీవ నదుల్లాంటివారు. మనం చేయవలసిందల్లా వారి ఉత్సాహానికి ఎక్కడికక్కడ ఆనకట్టలు కట్టకుండా వారి గమనానికి సరైన దిశను నిర్దేశించడమే!

మన పిల్లలు ఇష్టపడినవాళ్ళు యోగ్యులైతే వారి కులమూ, మతమూ, ప్రాంతాన్ని మనమూ పట్టించుకోకూడదు. అలాకాక వాళ్ళు రోహిత్‌లా ఎటువంటి మెచ్చదగిన గుణాలూ లేని వారైతే...మనం ఎందుకు వద్దనుకుంటున్నామనే విషయాన్ని అనునయంగా చెప్పి మన పిల్లల్ని ఒప్పించే ప్రయత్నం చేయాలి.

ముందుగా మన పిల్లలు తమ భావాల్ని యధాతథంగా మనతో పంచుకోగలిగే స్వేచ్ఛాయుత వాతావరణాన్ని మనం ఇంట్లో కల్పించాలి. అన్నిటికంటే ముఖ్యంగా మనసావాచాకర్మణా మన పిల్లల్ని స్నేహితుల్లా భావించాలి. అలా భావించామన్న నమ్మకాన్ని వారిలో కలిగించాలి.

ఈ చర్చ ద్వారా వచ్చిన సూచనల్లో ఆమోదయోగ్యమూ, ఆచరణీయమూ అని మనందరమూ భావించిన వాటిని మన కాలనీవాసులకే పరిమితం చేయకుండా అందరు తల్లిదండ్రులకూ చేరే విధంగా మనం కరపత్రాలు ముద్రించి పంపిణీ చేయాలి. తరచూ ఇటువంటి చర్చా కార్యక్రమాలు నిర్వహించాలి.

వివిధ రంగాల్లో నిష్ణాతులైన మేధావుల్ని చర్చా కార్యక్రమాలకు ఆహ్వానించి వారి సలహాలను పరిగణనలోకి తీసుకుని దీనిని ఒక ఉద్యమంలా నడిపించాలి. అప్పుడే మనం మన పిల్లల పట్ల మనకున్న బాధ్యతను సమర్థవంతంగానూ, సంపూర్ణంగానూ నిర్వహించినట్లవుతుంది."

నాలుగుదారుల కూడలిలో నిలబడి సరైన దారి తెలియక నిస్సహాయంగా దిక్కులు చూస్తూ నిలబడిన తమ పిల్లల దీనస్థితి కళ్ళముందు దృగ్గోచరం కావడంతో అందరూ ఆలోచనలో పడ్డారు. ★

**రచయిత చిరునామా :**
కె.వి.వి.ఎస్.రాజు,
సీనియర్ లైజన్ ఆఫీసర్,
కాఫీ బోర్డు, మినుములూరు- 531 024.
పాడేరు మండలం, విశాఖపట్నం జిల్లా.